క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పెదరాయవరంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

రంగంపేట: రైతులందరూ ఖరీఫ్ (సార్వా) 2024 సంవత్సరానికి తాము సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండలంలోని పెదరాయవరంలో నిర్వహిస్తున్న ఈ–క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు, కౌలు రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను కలిసి ఆధార్, భూమి పాస్ పుస్తకం జెరాక్స్‌లను అందించి తాము సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. పంట నమోదు పూర్తవకుంటే ధాన్యం కొనుగోలు, పంట నష్టం, పంటల బీమా వంటి పథకాలు రావని, ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: శ్రావణ మాసం రెండవ మంగళవారం సందర్భంగా బిక్కవోలులో కొలువైన శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

అమ్మవార్ల ఆలయాల్లో ఘనంగా పూజలు

బిక్కవోలు: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు, మంగళ గౌరి వ్రతం తదితర పూజలు నిర్వహించారు. బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక గౌరీశంకరులు, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయాల వద్ద ఉన్న స్నానాల రేవులోను కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖలింగేశ్వరుని ఆలయం వద్ద గల పుష్కరిణి వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి

రాజానగరం: బాల్య వివాహాలను చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వాటిని నిరోధించడం అందరి కర్తవ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి అన్నారు. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంపత్‌నగరం గ్రామ సచివాలయంలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల చట్టం 2006, సెక్షన్ 31, 39 గురించి వివరిస్తూ, బాల్య వివాహాలను అరికట్టడానికి జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఉండే అధికారుల వివరాలను తెలిపారు. అలాగే లైంగిక దాడుల నుంచి బాలికలను రక్షించే చట్టం (పీఓసీఎస్ఓ) 2012పై కూడా అవగాహన కలిగించారు. గ్రామాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. సర్పంచ్ పి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, సీడీపీఓ కార్యాలయ కౌన్సెలర్ సీహెచ్ అభిషా, సచివాలయ, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

రెండు మృతదేహాలు లభ్యం



వ్యక్తి మృతదేహం

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో రెండు వేర్వేరు చోట్ల గుర్తు తెలియని మృతదేహాలను పోలీసులు కనుగొన్నారు. మూడో పట్టణ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక లింగంపేట ఐదో వీధి ఆంజనేయస్వామి గుడి వద్ద మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్లుంటాయి. ఎడమ మోచేతిపై బి.రామారావు అని పచ్చబొట్టు ఉంది. అలాగే ప్రభుత్వాస్పత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద కూలీలు స్నానం చేసే ప్రాంతంలో మృతదేహం పడి ఉంది. ఈ మేరకు నిర్మాణ పనులు చేస్తున్న మెగా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది. రెండు మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుల వివరాలు తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

గ్రామీణ వైద్యానికి సుస్తీ

- పల్లె ప్రజల ఆరోగ్యం పట్టని ప్రభుత్వం
- అసంపూర్తిగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు
- త్వరగా వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



పైన గ్రామంలో అసంపూర్తిగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



జి.మామిడాడ సచివాలయం-1లో అసంపూర్తిగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

పెదపూడి: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు, రైతుల శ్రేయస్సు కోసం రైతు భరోసా కేంద్రాలు, ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందేలా హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. నేడు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో క్లినిక్‌ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. దీంతో పేదలకు అందుబాటులో వైద్యం అందించాలనే లక్ష్యం నీరుగారుతోంది. గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యం బారిన పడితే మండల కేంద్రం, లేదా దగ్గర్లోని పట్టణాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి గతంలో ఉండేది.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వివరాలు

మండలం	మంజూరైనవి	పూర్తయినవి	నిర్మాణ దశలో	ప్రారంభం కానివి
అనపర్తి	16	14	0	2
బిక్కవోలు	17	8	5	4
పెదపూడి	15	6	5	4
రంగంపేట	17	11	2	4
రాజానగరం	31	31	0	0
సీతానగరం	16	11	4	1
కోరుకొండ	20	12	8	0
మొత్తం	132	93	24	15

ఈ పరిస్థితి నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు విముక్తి కలిగేలా గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుకు నాంది పలికారు. వీటి నిర్మాణాలను పూర్తి చేసి క్లినిక్‌లో ఓ వైద్యుడిని, ఇతర ఇబ్బందిని నియమించి సొంత గ్రామంలోనే ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న దృఢ నిశ్చయంతో ఈ భవన నిర్మాణాలు చేపట్టారు.

132 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో రాజానగరం, అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, సీతానగరం, కోరుకొండ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో మొత్తం 132 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 93 నిర్మాణాలు పూర్తి చేశారు. 24 నిర్మాణాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంకా 15 నిర్మాణాలు ప్రారంభించలేదు. అయితే పూర్తయిన నిర్మాణాల్లో ఇంకా కొన్ని భవన నిర్మాణాలు ప్రారంభించలేదు. అయితే అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందుతాయని ప్రజలు కోరుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో మంజూరైన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వివరాలు ఇలా ఉన్నాయి.

మిగిలిన భవనాలను పరిస్థితి ఏమిటి?

ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడిచినా ఈ భవన నిర్మాణాలు ఇంకా పునఃప్రారంభం కాలేదు. వీటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందా ? మిగాతా పనుల్లాగే వదిలేస్తుందా ? అన్న సందిగ్ధంలో గ్రామీణులు ఉన్నారు. కనీసం పూర్తయిన వాటిని ప్రారంభించి గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడు అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లినిక్‌ల నిర్మాణం పూర్తి చేయాలి



గ్రామాల్లోనే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను చేపట్టింది. అందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. కొన్ని భవనాలు మధ్యలో ఆగిపోయాయి. వాటిని ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రజాధనం వృథా కాకుండా భవనాలను ప్రారంభించి గ్రామాల్లోనే ప్రజలకు వైద్య సేవలందించాలి

– గుత్తుల రమణ, రాజుపాలెం గ్రామం

గ్రామంలోనే వైద్య సేవలు



గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది. దీంతో ఆ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అయితే అసంపూర్తి నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేయడంపై ఎన్డీఏ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలి

– సొంబత్తుల చంటి, కాండ్రేగుల గ్రామం

బాధితులకు జక్కంపూడి పరామర్శ



బొల్లెద్దుపాలెంలో బాధితుడిని పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మంగళవారం కోరుకొండ మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. బొల్లెద్దుపాలెంలో ఇటీవల ప్రమాదంలో గాయపడిన గునుపే వీర్రాజు, బరకు అశోక్‌ను పరామర్శ చేశారు. అదే గ్రామానికి చెందిన అనారోగంతో బాధపడుతున్న కటకం వెంకటేష్‌ను పరామర్శించారు. రాజవరం గ్రామానికి చెందిన పైడా ఆచార్యులు, కొల్లి నాని ఇటీవల మరణించారు. వీరి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

తహసీల్దార్ లక్ష్మీలావణ్య బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ లక్ష్మీలావణ్యకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సిబ్బంది

రాజానగరం: కొత్త తహసీల్దార్‌గా ఎస్.లక్ష్మీలావణ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ డి.సునీత ఆమెకు బాధ్యతలను అప్పగించారు. ప్రజలకు ప్రభుత్వపరంగా సేవలందించడంలో చిత్తశుద్ధితో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

సమైక్యతకు నిదర్శనం త్రివర్ణ పతాకం



రంగంపేట ఏడీబీ రోడ్డుపై మానవహారంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు



పందలపాకలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

రంగంపేట: మువ్వన్నెల జాతీయ జెండా శాంతి, సత్యం, ధర్మం, అహింస జాతీయ సమైక్యతకు నిదర్శనమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మంగళవారం ఎంపీడీఓ పి. వెంకటరత్నం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఏడీబీ రోడ్డు వరకు జాతీయ పతాకాలతో భారీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏడీబీ రోడ్డులో అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

ఉత్సాహంగా మానవహారం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను పెంపొందించాలనే సంకల్పంతో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు త్రివర్ణ పతాకాలను చేతపట్టి వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పాఠశాల వ్యాయామ దర్శకులు ద్వారంపూడి యువరాజారెడ్డి ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని, మహనీయుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

జి.మామిడాడలో జాతీయ జెండాలతో ర్యాలీ

పెదపూడి: ప్రతి ఇంటిపై జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జి.మామిడాడలో మంగళవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎంఈఓ–2 సీవీవీసత్యనారాయణ, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రాజానగరం: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా 'ర్యాలీ కార్యక్రమాన్ని రాజానగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం స్థానిక గాంధీ బొమ్మ సెంటరు నుంచి ప్రారంభమై, ఎంపీడీఓ కార్యాలయం వరకు కొనసాగింది. ప్రతి భారతీయుడు తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, స్వాతంత్ర్య సంబరాల్లో భాగస్వాములు కావాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రీడమ్ పార్క్‌ను సందర్శించిన వీసీ



సమరయోధుల గురించి వీసీకి వివరిస్తున్న సభ్యులు

రాజానగరం /ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ఫ్రీడమ్ ఫైటర్స్ పార్క్‌ను మంగళవారం యూనివర్సిటీ విద్యార్థులతో పాటు, వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సందర్శించారు. ఆంధ్రకేసరి యువజన సమితి నాయకులు జమ్మి రామారావు, దేశిరెడ్డి బలరామనాయుడు, మాదిరాజు శ్రీనివాసరావు వీసీ ఆచార్య శ్రీనివాసరావుకు స్వాగతం పలికారు. స్వాతంత్ర్య సంగ్రామంలో రాజమహేంద్రవరం ప్రాంతం నుంచి పోరాడిన వీర మహిళల విగ్రహాలను, వారి పోరాట పటిమను, వారి జీవిత గాథలను జమ్మి రామారావు వీసీకి వివరించారు. ఈ సందర్భంగా పార్క్‌లోని గాంధీ విగ్రహానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటి నుంచి బయటకు రాని కాలంలోనూ దువ్వూరి సుబ్బమ్మ వంటి మహిళామూర్తులు స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసి, ఆంధ్రదేశంలో అరెస్ట్ అయిన తొలి మహిళగా చరిత్రలో నిలిచారని తెలిపారు. మహిళలు అంతటి వీరోచితంగా ఉంటూ, లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. అలాగే మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గొప్ప లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, మహనీయులను ఆదర్శంగా తీసుకొని జీవిస్తే, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. అనంతరం రాజమహేంద్రవరం కేంద్రంగా జమ్మి రామారావు ప్రచురించిన వివిధ పుస్తకాలను ఆయన విశ్వవిద్యాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఎం.గోపాలకృష్ణ, రాజశేఖర్, అప్పలరాజు, శిరీష, సుజాత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



రామేశ్వరంలో ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్డు వద్ద సర్పంచులకు అవగాహన కల్పిస్తున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రసన్నకుమార్

పెదపూడి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని స్టేట్ రిసోర్స్‌పర్సన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచులు, సచివాలయం కార్యదర్శులకు మూడు రోజులపాటు పునశ్చరణ తరగతుల్లో భాగంగా రెండో రోజు శిక్షణ తరగతులు అనంతరం రామేశ్వరంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరుడి బాధ్యతలను సర్పంచులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించి మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటుగా ఆర్థిక సంఘం, పంచాయతీ నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని చెప్పారు. రామేశ్వరంలో ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్డు వద్ద గ్రామంలో చెత్త సేకరణ ఏ విధంగా చేపట్టాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ ఆశాజ్యోతి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, పుట్టకొండ సర్పంచి వల్లు వెంకటరమణ, కార్యదర్శులు అచ్చిరాజు, మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తికి నిదర్శనం



కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్మారక స్థూపం

ఎంపీడీఓ భవనంలో చిత్రపటాలు, స్మారక స్థూపం

మధురపూడి: ఎందరో స్వాతంత్ర్య యోధుల పోరాట స్ఫూర్తి అక్కడ తొణికిసలాడుతోంది. కోరుకొండ మండలం కాపవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుల పోరాట గాథను వినిపించేలా వారి చిత్రపటాలు ఏర్పాటు చేయడం ఇక్కడ విశేషం. ఎంపీడీఓ కార్యాలయ భవనంలో వివిధ జిల్లాలకు చెందిన 25 మంది యోధుల చిత్రపటాలను ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్య పోరాట వీరుల స్మారక స్థూపాన్ని కూడా నెలకొల్పారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చిలకమర్తి వెంకటనరసింహం, గుంటూరుకు చెందిన కొండా వెంకటప్పయ్య తదితరుల చిత్రపటాలున్నాయి. సమితి కార్యాలయంలో ఉన్న యోధులను స్మరిస్తూ, స్మారక స్థూపాన్ని గతేడాది ఇక్కడ పునః ప్రతిష్ఠ చేశారు. ప్రస్తుత ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, నాటి ఎంపీడీఓ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటుచేశారు.

స్టేడియం పనులు వెంటనే ప్రారంభించండి

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం



స్టేడియం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నాగులచెరువు మార్కెట్ వద్ద ఉన్న పోతుల వీరభద్రరావు మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్‌లో నిర్మించ తలపెట్టిన క్రికెట్ స్టేడియం పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కేతన్ గర్గ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, శాప్ అధికారులతో కలిసి స్టేడియం ప్రాంతాన్ని సందర్శించారు. క్రికెట్ స్టేడియంలో చేపట్టనున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రౌండ్ ఫ్లోర్‌లో అదనంగా టాయ్‌లెట్లు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, దుస్తులు మార్చుకునే గదులు నిర్మించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు పడమర వైపున గేటు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని పనులకు తగిన అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవాలని ఆదేశించారు. వీరి వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా ఆలీ, డీఈఈ ప్రసాద్, ఏఈ సందీప్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న ప్రసాద్ అనే వ్యక్తి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

తనకు రూ.20 వేలు అప్పు ఇచ్చిన వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని లాక్కుని వేధిస్తున్నాడంటూ ఈ నెల 10న లింగంపేటకు చెందిన ప్రసాద్(42) మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు సాయంత్రం ప్రసాద్ పోలీస్‌స్టేషన్ వద్ద పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య యత్నం చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు కాకినాడకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్వ్యసనాల వల్ల జీవితం నిర్వీర్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనసూరి ప్రియాంక

రాజమహేంద్రవరం సిటీ: గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు తమ జీవితంలో లక్ష్య సాధనకు పాటుపడాలని జేసీఐ ఇండియా జోన్ ట్రైనర్, జీవనశైలి స్పెషలిస్ట్, శ్రీలత హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అనుసూరి ప్రియాంక అన్నారు. మంగళవారం స్థానిక సంహిత డిగ్రీ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు, జేసీఐ రాజమండ్రి పెరల్స్ ప్రెసిడెంట్ జేసీ గీతా రామదేవు ఆధ్వర్యంలో ఆమె మాదక ద్రవ్యాల నుంచి కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ పొగ తాగడం, మద్యం సేవించడం వంటి దుర్వ్యసనాల వల్ల రోగాలు చుట్టుముడతాయన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితం నిర్వీర్యమవుతుందని హెచ్చరించారు. అందుకే మాదక ద్రవ్యాల జోలికి అస్సలు వెళ్లవద్దని హితవు పలికారు. కేవలం చదువుపైనే దృష్టి సారించి, ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.